కనీస మమ్మీ డాడీ

రెండేండ్ల బాబు ఎదురుగా ఒకరోజు బాగా గొడవపడ్డారు సుజాత, రాజారావూ. వాళ్ళ పోట్లాట చూసి, చూసి బిక్కమొహంవేసి, చివరికి గుక్కపట్టి ఏడ్చేశాడు బాబు.

ఆలుమగలిద్దరూ ఆరోజు ఒట్టేసుకుని ప్రమాణం చేసుకున్నారు, బాబు ఎదురుగా మాత్రం పోట్లాడుకోకూడదని.

తర్వాత ఏడాదికే బేబీ పుట్టింది.

అయినా సుజాత, రాజారావూ చేసుకున్న ప్రమాణం తప్పలేదు పిల్లలెదురుగా ఇద్దరూ అమితమంచిగా, బోలెడంత అన్యోన్యంగా, చాలా హాయిగా ఉంటారు.

పిల్లలలా వెళ్ళగానే ఒకర్నొకరు తక్కేసుకుంటారని కాదు. ప్రేమ వివాహం కాదుగాని, పెళ్ళయినప్పటినుండి ప్రేమించుకుందామనే ప్రయత్నిస్తున్నారు సుజాత, రాజారావు ప్రయత్నిస్తే పుడుతుందా ప్రేమ?

ఇద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' కాదని తేలిపోయింది. ఇద్దరి అభిరుచులు వేరు, సంస్కారాలూ వేరు. ఇద్దర్నీ అన్యోన్య బంధంలో కట్టిపడేసే మహత్తర ఆశయం ఏదీలేదు మరి ప్రేమ ఎలా సాధ్యమౌతుంది?

ప్రేమయితే లేదుగాని, ఇద్దరి మధ్య పూర్తిగా ద్వేషమయినా లేదు

ఎలాగో కుదిరి, స్థిరపడి, ముడిపడి పోయిన వైవాహిక బంధాన్ని కొనసాగించాలనే ఇద్దరి తాపత్రయమూ. కాని, విడిపోయి తప్పుకెళ్ళాలని ఇద్దరికీ ఏకోశానా లేదు

రోజుకో పోట్లాట, వారానికో గంట ప్రశాంతిగా వాళ్ళకాపురం సాగిపోతూనే ఉంది కాని, ఇద్దరి మధ్య గొడవలు తెగు

తున్నట్లు పిల్లలకి మాత్రం తెలియనివ్వ కూడదని వాళ్ళ ప్రయత్నం.

రాజారావు తల్లీ, తండ్రీ ఎప్పుడూ పోట్లాడుకుంటూ ఉండేవారు. అంచేత, ఆతనికి ఇంటి వాతావరణమంటే అసహ్యం మేసి ఎల్ల వేళలా మిత్రులతో గడపటం అలవాటయిపోయింది. ఆ స్నేహాలు ఎన్నోసార్లు బెడిసికొట్టాయి. ఫలితంగా అతను కొంతమేరకు నష్టపోయాడు కూడా. సుజాత చిన్నతనంలో ఇంట్లో చేదు జ్ఞాపకాలని భరించింది. తల్లిని తండ్రి తరచు కొట్టేవాడు, తల్లి ఒంట రిగా కుములుతూ ఉండేది. తన పిల్లలకి మాత్రం ఇటువంటి చేదు జ్ఞాపకాలు మిగలకూడదనే ఆమె తపన

పిల్లలముందు 'నటించటం' మాత్రం ఎందుకు? ఇద్దరూ నిజంగానే, పూర్తిగా అన్యోన్యంగా ఉండరాదా? అంటే–

ప్రయత్నలోపం లేదు, ఒకరి బలహీన తలు ఒకరికి తెలుసు. ఎవరి తప్పు వారికి కూడా మరుసటి క్షణంలో తెలిసిపోతూనే ఉంటుంది. అయినా, తాత్కాలిక ఉద్రే కంలో మాటామాటా అనుకోకుండా ఉండలేరు. దేవుడు చేసిన మనుషులం– ఎంతకని మారుతాం? అనే ధోరణి వచ్చే సింది ఇద్దరికీ కూడా.

* * *

ఆదివారం ఉదయం టిఫిన్ దగ్గరే వచ్చింది పోట్లాట.

"ఏడిసినట్టుంది పెసరట్టు. నీకు పెస రట్టు చేయటం రాదు. రానిది ఎందుకు చేయాలి?"

"ఏమైందండీ?"

"మాడ్చి పెట్టావు."

"అవతల పెట్టేయండి. మరోటి వేస్తాగా–"

"నా మొహం వేస్తావు, వేసింది చాలు. కాఫీ తగలడు."

"మరో అట్టు వేస్తానంటుంటే. మీకు ఇష్టమనికదా పెసరట్లు పెట్టుకున్నా ఇవాళ –"

"నా కిష్టమనే– మాడ్చి పెట్టావు–"

"ఎందుకలా కోప్పడతారూ? హోటల్ కెళ్తే రోస్టు – అని ఆర్డరివ్వరూ?"

"రోస్టంటే బాగా కాల్చమని–బొగ్గుగా మార్చమని కాదు– నీకు చెప్పడం వేస్టు, ఛఛ–ఆదివారమైనా శుభ్రంగా తిందామని లేదు–"

"ఇప్పుడేం మునిగిపోయిందని? మరో అట్టు వేస్తానన్నాను – నిజానికి అప్పు డిచ్చిందికూడా మాడలేదు. చక్కగా ఉంది–"

"ఆ – మహ చక్కగా ఉంది–"

సమయానికి బాబూ, బేబీ ఇంట్లో లేరు. పక్కింటి పిల్లల్తో ఆడుకోవటానికి వెళ్ళారు. పిల్లలు ఇంట్లో లేకపోవడంతో ఇద్దరికీ బోలెడంత 'స్వేచ్ఛ' దొరికింది.

"ఏం వెక్కిరిస్తావు? ఒక్క నిమిషం చేసి చూడండి వంట – తెలుస్తుంది–"

"ఆఁ చేశావులే – బోడి వంట–"

"ఇదుగో-బోడి గిడి అనకండి-"

"ఏం అంటేనేం?"

"మీరు చేసేది బోడి ఉద్యోగమని నేనంటే-"

"నేను చేసేది బోడి ఉద్యోగమా?"

"అవి నేనంటే ...?"

"ఏం-నీ బోడి మొహానికి ఇంతకన్న మంచి మొగుడొస్తాడనుకున్నావా?"

"ఛీఛీ! బొత్తిగా సంస్కారంలేని మనుషులు-"

"నీ సంస్కారం తెలుస్తూనే ఉంది. భర్త ఎంత హీనుడైనా పూజలుచేసే ఇల్లాళ్ళున్నారు. నెలకు వెయ్యిన్నీ ఎని మిదివందలు తెచ్చిపోస్తుంటే - బోడి ఉద్యోగమా?"

"ఊరికే-ఇదై పోకండి-మొదట బోడి అన్నది మీరే-"

"ఎప్పుడైతేనేం? నా ఉద్యోగం గురించి నువ్వు-బోడి-అన్నావా లేదా?"

"ఎప్పుడన్నాను?-మీరు అన్నాక-"

"అసలు అనలేదని కూడా అంటావు. పీకేం? రెణ్ణెళ్ళప్పుడు - మీ మద్రాసు మేనమామ ఎదుట - చేతగాని వెధవ అనలేదూ?"

"నేనేమీ 'వెధవ' అనలేదు-"

"పోనీ చేతగానివాడన్నావు కదా!- ఆ వెధవకన్న చేతగానివాణ్ణా నేను?"

"ఇదుగో మాటలు మిగలకండి. పోన్లెండి-కాఫీ అయినా తీసుకోండి-"

"కాఫీ-ఆ కాలవలో పొయ్యి. అది వారం ఇంత గొప్పగా తెల్లారింది. ఇక కాఫీ ఒకటి-ఛ-ఛ-కొంపలో సుఖంగా ఉందామని లేదు-"

"చీటికి మాటికి నోరుపారితే సుఖం ఎలా వస్తుంది- ఇంటిమనుషులతో మెలగ టం మీకు అలవాటుంటే కదా? ఎప్పుడూ బజార్లంట తిరగటం-"

"ఛస్-పోతాను. మళ్ళీ బజార్నపడే పోతాను. ఈ పాడుకొంపలో కాపురం కన్న బజార్నపడి అడుక్కు తినటం మేలు-"

చెప్పుల్లో కాళ్ళు దూర్చి వీధిగుమ్మం దాకా వచ్చాడు రాజారావు. సరిగ్గా అప్పుడే బాబూ, బేబీ ఎదురువచ్చారు.

"డాడీ-నేనూ వస్తా" అంది బేబీ

"ఎక్కడికి డాడీ? నేనూ రానా?" అన్నాడు బాబు? "ఆదివారం ఐస్‌ఫ్రూట్ తీసిస్తానన్నావుగా-" అని గుర్తుచేశాడు.

పిల్లల్ని చూడగానే, ముఖంలో చిరాకు కొంత తగ్గించుకుని "మళ్ళీ ఇప్పుడే వస్తాగా" అంటూ వెళ్ళిపోయాడు రాజారావు.

"మమ్మీ - డాడీ ఎక్కడికి వెళ్ళారు?" అన్నాడు బాబు.

"ఐస్‌ఫ్రూట్ ఎప్పుడు మమ్మీ?" అంది బేబీ.

నవ్వుముఖం పెడుతూ, పిల్లల్ని దగ్గ రకు తీసుకుంది సుజాత.

"డాడీ అర్జెంటుగా ఏదో పనుందని వెళ్ళారు. మధ్యాహ్నం - భోంచేశాక -



మిమ్మల్ని తీసుకెళ్ళి-ఐస్‌ఫ్రూట్ కొని పెడతారు, ఏం? మరి మీరంతా టిఫిన్ తినలేదుగా-రండి - వేడివేడిగా ఉన్నాయి పెసరట్లు - పెసరట్లంటే నీకిష్టం కదూ బేబీ - అందుకని చేశాను-"

"నాకూ-డా ఇష్టమే మమ్మీ-అయితే పంచదారతో తింటాను-"

"అలాగే-రండి మరి-"

* * *

మధ్యాహ్నం మూడు గంటలవుతుండగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి తిరిగొచ్చాడు రాజారావు, కోపం సడలినా, బింకం ఉందిగాని, అంతకన్న అలసటే స్పష్టంగా కనిపిస్తోంది.

లుంగీ అందిస్తూ, "రండి-భోంచేద్దురుగాని-" అంది సుజాత.

"ఆకలిగా లేదు-"

"మీ ఇష్టం, నేనూ ఇంకా తినలేదు-"

"అదేం-" అన్నాక, ఒక నిమిషానికి డైనింగ్‌టేబిల్ దగ్గరికి నడిచాడు రాజారావు.

మౌనంగా ఆమె వడ్డిస్తుండగా, అతను మౌనంగా తిన్నాడు. మజ్జిగన్నం అయిపో వస్తుండగా. తల దించుకునే, "అయాం సారీ సుజీ-" అన్నాడు.

"ఛ-అదేమిటండీ-ఐ షుడ్ బీ సారీ- మీకు ఎంతో ఇష్టమైన పెసరట్టుని-మాడ్చి పెడితే చిరాకెయ్యదూ...."

అలా రాజీ కుదిరిపోయింది.

వక్క-పొడేసుకుంటూ, "పిల్లలేరీ?" అన్నాడు రాజారావు. ఆదివారం, ఆ వేళప్పుడు పిల్లలు ఇంట్లోనే ఉంటారని

తెలుసుగాని, వాళ్ళప్పుడే గుర్తువచ్చి వట్లుందతనికి

"మేడమీదున్నారు–" అంది సుజాత.

మేడమీదున్న ఒకే ఒక్క గది, గెస్ట్ రూంగానూ, పిల్లలు ఆడుకోవటానికీ ఉపయోగపడుతోంది.

మేడమెట్లవైపు నడుస్తున్న రాజా రావును చూసి, నవ్వుకుంది సుజాత. అతని ధోరణి సుపరిచితమే. ఇలా ఇద్దరి మధ్య పోట్లాటవచ్చి, రాజీ కుదిరినప్పు డల్లా, అతనికి పిల్లలమీద ప్రేమ మరింతగా పెరిగిపోతుంది. రాజీ కుదిరినా అతనిలో బింకం వెంటనే పూర్తిగా సడలదు. పిల్లలతో కాసేపు కబుర్లుచెప్పి, వాళ్ళదగ్గర 'మమ్మీ'ని పొగడటం మొదలుపెడితే, అప్పుడిక పూర్తిగా ప్రశాంతపరిస్థితి ఏర్పడిపోయినట్లే లెక్క.

సుజాత వంటిల్లు సర్దటం పూర్తి కావస్తుండగా, మేడమెట్ల దగ్గర్నుంచి, మెల్లగా "సుజీ" అని పిలిచాడు రాజారావు.

ఏమిటన్నట్లు చూసింది సుజాత.

రమ్మన్నట్లు సైగచేశాడు రాజారావు.

ఆ ధోరణిచూస్తే, పిల్లలగురించి ఏదో విశేషం చెబుతాడని అర్థమౌతుంది ఆమెకు. "ఏమిటండీ?" అంది దగ్గరకు వెళ్ళి.

"రా–చెబుతా–" అంటూ ఆమె చెయ్యి పుచ్చుకుని, మెట్లవెంట పైకి తీసుకు వెళ్లాడు.

మెట్లెక్కాక, చిన్న వరండా ఉంది. వరండాచివర గదిగుమ్మం ఉంది. గుమ్మం దగ్గర, వారగా ఆగి, లోపలికి చూడ మన్నట్లు సైగచేశాడు రాజారావు. అతని భుజంమీదుగా లోపలికి చూసింది సుజాత.

లోపల బాబూ, బేబీ ఆడుకుంటు న్నారు. అయితే, ఆదేమీ బొమ్మలతో ఆడుకోవటంకాదు. ఏదో మహత్తర నాటక ప్రదర్శనకు 'రిహార్సల్స్' చేస్తున్నట్లు– ఇద్దరూ రెండు పాత్రల్ని పోషిస్తున్నారు.

"మరి–అంకుల్ సిగరెట్టు తాగుతాడు కదా?" అంటోంది బేబీ.

"అవును కదా– అంకుల్ – సిగరెట్టు తాగుతాడు–" అంటూ వెళ్ళి, గదిలో మూలపడిఉన్న మ్యాగజైన్లలోంచి ఒక కాగితం చించుకుని వచ్చాడు బాబు. కాగితాన్ని చుట్టి, సిగరెట్టులా చేతబట్టి, పెదవులమధ్య ఉంచుకున్నాడు. అచ్చంగా పక్కింటి 'అంకుల్'ని అనుకరిస్తున్నాడు.

"ఛ–ఎన్నిసార్లు చెప్పినా నీకు బుద్ధే లేదు–" అన్నాడు బాబు హఠాత్తుగా.

"బుద్ధిలేంది మీకే వొంది–" అంది బేబీ, పక్కింటి 'ఆంటీ'లాగా చేతులు తిప్పుతూ

"నాన్సెన్స్" అన్నాడు బాబు, సిగిరెట్టుపొగలా నోట్లోంచి గాలిని ఊదుతూ–

"యూ షటప్–"

"మీరే నోరుమూసుకోండి. యేల్లాస్తున్నాయి ఎందుకా?"అంది బేబీ."యేల్లాస్తున్నాయి" అనేమాటను సరిగా పలకటం చేతకాలేదు.

"యూ ఇడియట్ —ఫూల్——డెవిల్— నువ్వు ఆడదానివా? రాక్షసివా?" అన్నాడు బాబు కళ్ళు ఉరుముతూ.

"మీరు మొగవారైతే నేను ఆడదాన్నే—అంది బేబీ చేతులు తిప్పుతూ, ఆమాట అంటూ బేబీ, పకీపకీ నవ్వింది. 'నటన' మానేసి బాబుకూడ నవ్వులో శ్రుతికలిపేశాడు.

బోలెడంత ముద్దవిపించి, గదిలోకి వెళ్ళబోయింది సుజాత. చెయ్యిపుచ్చుకుని అక్కడే ఆపేశాడు రాజారావు. "ష్!" అన్నాడు.

అతను అంకించింది రైట్! లోపల, ఒక 'సీన్' ముగిసింది కాని, నాటకం ఇంకా పూర్తికాలేదు.

"ఇప్పుడింక 'డాడీ — మమ్మీ' ఆట ఆడదాం—" అన్నాడు బాబు.

"సరే-నేను డాడీ - నువ్వు మమ్మీ—" అంది బేబీ.

"అఁహఁ-నేనే డాడీ——నేను బాయి— నువ్వు గర్లు కదా—అందుకని—"

"సరే అయితే - డాడీ ఏం చేస్తాడు?"

"నువ్వు వంటింట్లోకి వెళ్ళాలి-" అన్నాడు బాబు. తను కుర్చీలో కూచున్నాడు.

వంటింట్లో ఉండటాన్ని అభినయిస్తూ, గోడవారగా వెళ్ళి నిలుచుంది బేబీ.

కుర్చీలో కూచుని, రాజారావులా పేపర్ చదవటం అభినయిస్తున్నాడు బాబు. చేతిలో కాఫీ కప్పు పట్టుకున్నట్లు, జాగ్రత్తగా నడుస్తూ, సుజాతలా ప్రవేశించింది బేబీ.

"ఇదుగోండి-కాఫీ—"

పేపర్లోంచి తలెత్తకుండా, కాఫీ అందుకొని చప్పరిస్తున్నాడు బాబు.

బేబీ మరో కుర్చీలో కూచుని, సుజాతలా కాలిమీద కాలువేసుకొని, ఒక మ్యాగజైన్ చేతుల్లోకి తీసుకుంది. మ్యాగజైన్ చదువుతున్నట్లు, తల అటునుంచి ఇటు తిప్పుతోంది.

"కాఫీ ఎక్కువేంటుగా ఉంది_"

"స్నానం చేస్తారా?"

"కాస్సేపాగి చేస్తాము_"

"కాకరకాయ వేపుడు చేశాను_"

"వెరీగుడ్."

"రేపు సినిమాకు వెళ్దామా?"

"ఓ.కె."

"రేపు మధ్యాహ్నం నేను షాప్‌కు వెళ్ళాలి_"

"ఊఁ_వెళ్ళిరా_"

"టి.వి లో ఇవాళ హిందీ సినిమా ఉంది_"

"అలాగా - అయితే చూద్దాం_"

"మరి_తొందరగా స్నానంచేయండి_"

"అలాగే_"

"ఈలోగా నేను వడ్డించేస్తాను_"

"ఓ.కె."

"ఆఁ బాబూ! బేబీ! మీరూ రండి_ దాటి స్నానానికి వెళ్ళారు. అందరం తొందరగా తినేసి - టి.వి లో సినిమా చూద్దాం - హిందీసినిమా_"

బోలెడంత మురిసిపోతూ, ముఖ ముఖాలు చూసుకున్నారు సుజాతా, రాజా రావూ. పిల్లల 'నటన' అత్యద్భుతంగా ఏమీలేదు. అయితే, పిల్లలు ఇంట్లో ఉండగా, దాదాపు ప్రతి సాయంత్రం వాళ్ళిద్దరిమధ్య నడిచే సంభాషణ-దాదాపు అలాగే ఉంటుంది.

"ఇంక చాలు-ఈ ఆటేం బాగాలేదు_" అంది బేబీ ఉన్నట్టుండి.

"అవును .ఏం బాలేదు_" అన్నాడు బాబు.

"డాడీ - మమ్మీల ఆట - బోరుకొడుతుంది_" అంది బేబీ, అరిందాలా.. ....

"అవును_బోరే_అయితే_మరి_ఆట ఆపేద్దామా?_"

"మళ్ళీ ఆంటీ - అంకుల్ ఆడదాం_ మొన్న ఆంటీని అంకుల్ చెంపమీద కొట్టలేదూ? ఆ ఆట రెడీ ... ఈసారి కూడా నువ్వే అంకుల్ . నేనేమో ఆంటీ ..అయితే నా చెంపమీద గట్టిగా కొట్టకూడదు-ఏం? . "

క్షణాల్లో బాబు, బేబీల మొకం మారిపోయింది. ఇద్దరూ ఆంటీ-అంకుల్ అయిపోయారు.

"షటప్"

"మీరే నోరుమూసుకోండి_"

"నన్నే నోరు ముయ్యమంటావా?"

చెంపదెబ్బ ఎప్పుడొస్తుందోగాని, ఈలోగా భీకరంగా అరుచుకున్నారు ఆంటీ, అంకుల్ పాత్రల్లో బాబూ, బేబీ.

వాళ్ళ అభినయం వాళ్ళకే ముచ్చటేసి, డైలాగులు ఆపి, మధ్యలో పదీపదీ నవ్వుతున్నారు.

ముఖముఖాలు చూసుకున్నారు— సుజాతా, రాజా రావూ చేసుకున్న ప్రయాణం_వెక్కిరిస్తున్నట్లనిపించింది.